
# రెండు అగాధాలు



P. రాధ. B.Sc

నేను తాతయ్యఊరు వచ్చినరోజే నన్ను ఆకర్షించింది, మా ఇంటికి ఎదురుగా వెలసిన పెద్ద భవంతి! గేటుకు ''మిస్ మేరీ, M. B. B. S.'' అన్న బోర్డు తగిలించి వుంది. ఆ ఇంటిముందు మూగే రోగులను చూస్తే, యీ ఊళ్లో యింకొక డాక్టరే లేరా అనిపిస్తుంది. మేరీ అంటే ప్రతి వాళ్ళకీ తగనిఅభిమానం. "మేరీ బంగారు తల్లి-మా పాలిట దేవత!" ఎవరి నోట విన్నా యీ పొగడ్తలే! ఈ విధంగా ప్రతి వారిచేతా పూజింపబడుతున్న మేరీని చూడా లనిపించింది నాకు.

ఆ రోజు ఆదివారం. మేరీ ఇంట్లోనే వున్న దని తెలుసుకొని, వెంటనే బయలు దేరి వెళ్ళాను. మేరీ క్రింద హాల్లోనే కూర్చొని వుంది. నన్ను గుమ్మంలో చూస్తూనే ఆప్యాయంగా లేచి నిల్చొని ఆహ్వానించింది. ఆమెను చూస్తూనే ఒక్క

సారి నా మేను పులకరించింది. మేరీ చాలా అందమైంది. దివ్యస్వరూపిణి. భగవంతుడు యీమెకు యేలోటూ పెట్టలేదు. ఇటువంటి స్త్రీని చూచి స్త్రీలోకం గర్వపడాలి! మేరీకి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. చిరునవ్వుతో ముద్దుగా నావైపు చూచింది మేరీ.

"మీ పేరు?"

"మాలతి."

"మీవారి కేం పని?"

"డాక్టరు."

"పిల్ల లున్నారా?"

"ఇద్దరు. పెద్దవాడు అబ్బాయి, రెండోది పాప."

తృప్తిగా చూచింది మేరీ.

"అదృష్టవంతురాలివి!"

మేరీ అన్నమాటకు నాలో నేను నవ్వుకున్నాను. రోజూ అనరాని మాట లనే అత్తయ్యతో, నే నంటే లెక్క చెయ్యని భర్తతో, మాట వినని పిల్లలతో సతమతమౌతున్న నేనుకూడా అదృష్టవంతురాలనా? ఇంతకూ అదృష్టమంటే యీ అదృష్టవంతుల దృష్టిలో యేమిటో? తరువాత చాలా విషయాలు చాలాసేపు మాట్లాడుకున్నాము. మేరీ చాలా సన్నిహితంగా మాట్లాడింది. ఇంతటి సహృదయురాలితో పరిచయం లభించడం నా పూర్వజన్మ సుకృతంగా తోచింది నాకు.

వారం పదిరోజులు గడిచాయి. ఆ తరువాత మేరీని ఎప్పుడూ కలుసుకోలేదు. ఇంట్లో ఏ పనీలేక తిని కూర్చున్న నాకూ, యితరుల ఆరోగ్యానికై యిరవై నాలుగు గంటలూ పాటుపడే మేరీకి పొత్తు యెలా కుదురుతుంది? మేరీ యింటినుండి పసిపిల్లవాడు వచ్చాడు. "అమ్మగారు తీరికగా వున్నారు. మీరు వస్తారా లేక అమ్మగారే యిక్కడికి రావాలా?" అని అడగమన్నారు, అన్నాడు.

మేరీ కబురు పంపడమే నా అదృష్టం అని పొంగిపోయిన నేను, ఒక్క పరుగులో మేరీని చేరాను. మేరీ, నేనూ మేడమీద ఆ మెరూములో కూర్చొని చాలాసేపు మాట్లాడుకున్నాం.

"మేరీ! నీవు పెళ్లి చేసుకోకూడదూ?" అని నవ్వుతూ అడిగాను.

నవ్వుతున్న మేరీ కళాహీనంగా మారింది.

నిట్టూర్చింది.

"మాలతీ! నేను పెళ్ళి చేసుకున్నాను. నాకు పెళ్ళయ్యింది మాలతీ!" ఆవేదనలో ఆవేశాన్ని నింపుకొని, పదేపదే యీ మాటలే అన్నది మేరీ. నేను ఏమీ మాట్లాడలేకపోయాను. 'మిస్ మేరీ' అన్న బోర్డు యింటిముందే తగిలించి వుంది. ఆమె తప్ప అన్యు లెవ్వరూ లేరు. మేరీ కన్య. కానీ.... నా అనుమానం నోటనే అణిచేశాను. యీ పరిస్థితుల్లో మేరీని ఏ ప్రశ్నోవేసి ఆమెను విసిగించలేదు. ఇంతలో ఫోను గణగణ మ్రోగింది. మేరీ ఫోనులో మాట్లాడింది.మరుక్షణంలో ఆమె మామూలు మేరీ అయింది. "మాలతీ! ఒక పేషంటుకు జ్వరం ఎక్కువగా వుందట. నేను వెళ్ళాలి. ఇంకోసారి కలుసుకుందాం" అంటూ, గబగబా క్రిందికి వెళ్ళింది. నేనూ అనుసరించాను.

తక్షణం బయలుదేరి రమ్మని అత్తయ్య ఘాటుగా నాలుగు పేజీల ఉత్తరం వ్రాసింది. ఆఖరుసారిగా మేరీని చూడాలని వెళ్ళాను.

"ఏం మాలతీ - కనిపించడమే లేదు" అని అడిగింది మేరీ.

"ఏం లేదు. మీకు తీరిక వుంటుందో వుండదో అనుకున్నాను."

"నిజమే మాలతీ! నాకు ఒక్కక్షణం కూడా తీరి కుండదు. వుండకూడ దనే నా కోర్కె!"

అదోవిధంగా నవ్వింది మేరీ.

చివుక్కుమంది నా మనస్సు.

"మాలతీ! నువ్వు ఒక ప్రశ్న అడగాలనుకున్నావు కదూ?" నావైపు సూటిగా చూస్తూ అడిగింది. మేరీ మాటలకు సిగ్గుపడ్డాను. నిజమే-నేను అడగాలనుకున్నది మేరీ అర్థంచేసుకున్నది.

మేరీ చెప్పడం మొదలుపెట్టింది.

"నేను మెడిసిన్ చదివే రోజుల్లో ఒక సహాధ్యాయునితో పరిచయమైంది. ఐదు సంవత్సరాలు ఒక్కటిగా చదివాం. వారు హాస్టల్లో వుండేవారు. మా యింటికి తరచు వస్తుండేవారు. మాలో ప్రేమ చిగురించింది. ఏ విషయాల్లోనూ మాకు అభిప్రాయభేదా లుండేవి కావు.

"నా చిన్నతనంలోనే నాన్నపోవడం వల్ల, అమ్మ అల్లారుముద్దుగా, తన సర్వస్వంగా పెంచింది. నేనంటే అమ్మకు పూర్తి నమ్మకం. జీవితం హాయిగా సాగిపోయింది. మాకు ఆఖరి సంవత్సరం పరీక్షలై పోయాయి. వారు మాయింటికి వచ్చారు.

"మేరీ—పరీక్ష ఫలితాలు వస్తూనే, యిక్కడికి వచ్చేస్తాను. మా నాన్న ఒప్పుకున్నా, లేకపోయినాసరే, నిన్ను నా దాన్నిగా చేసుకుంటాను. ఇద్దరం డాక్టర్లమే!" - అన్నారు.

"పెండ్లి"అన్న పదం వారి నోటంట రావడంతోనే, నా జీవితానికి నిండుతనం కలిగిం దనుకున్నాను. సిగ్గు పడ్డాను.

నవ్వుతూ వారు వెళ్ళిపొయ్యారు.

వారు తప్పక వస్తారు - నన్ను వారి దాన్నిగా చేసుకుంటారన్న దృఢనమ్మకం నాకు. ఉత్సాహంతో, ఆనందంగా రోజులు గడిచాయి. పరీక్ష ఫలితాలొచ్చాయి. ఇద్దరం ప్యాసయ్యాం. వారి రాకకు ఎదురు చూస్తూండేదాన్ని. ఒక రోజు ప్రొద్దున్నే ఒక పెద్దమనిషి మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు. వారిని నేనే ఆహ్వానించాను.


"మీరేనా మేరీ?"అని అడిగారు.

"అవునండీ!"

"మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి!"

"చెప్పండి."

"అమ్మా - నేను నీవు ప్రేమించిన అబ్బాయి తండ్రిని. వాడు నా కొడుకు" అన్నారు. వారు తన్ను తాను పరిచయం చేసుకోవడమే వింతగా తోచింది నాకు.



"మేరీ! నేను నీ తండ్రిలాగ చెపుతున్నాను. వేడుకుంటున్నాను. నా కొడుకును నాకు వదిలేయి. నాకు దక్కనీయి - నా వాడిని చెయ్యమ్మా! - మేము బ్రాహ్మలం-మీ వివాహానికి మా మతం అంగీకరించదు. నేనూ సమ్మతించను. నా చెల్లెలి కూతురు వాడికై వేచివుంది. చెల్లెలికి మాట యిచ్చి తప్పలేను. ఈ వివాహమే జరిగితే, మిగిలిన నా బిడ్డలను మా జాతివారు పెండ్లాడరు. నాకోసం కాకపోయినా, నీలాంటి నా ఆడబిడ్డల శ్రేయస్సుకోరి వాడిని మరిచిపో తల్లీ - నాకు పుత్ర భిక్ష పెట్టు!" అని వాపోయాడు.

తలుపు చాటునుంచి వారి మాటలు మా అమ్మ విన్నది. యిక వుండలేక బైట పడింది.

"నా బిడ్డ బదులు నేను మీకు మాట యిస్తున్నాను. మీ అబ్బాయిని మా అమ్మాయి యిక మీదట కన్నెత్తయినా చూడదు. మీ వంశ మర్యాదలు మాకోసం బలికా నవసరం లేదు. ఇక మీరు నిశ్చింతగా వెళ్ళొచ్చు!"

ముసలాయన, నమ్మమంటావా అన్నట్టు నన్ను చూచాడు. నా తల్లి నాకు మార్గదర్శియై నిలిచి, నాకు దారి చూపించింది.

సూటిగా, ధైర్యంగా అతన్ని చూశాను.

"ఇంతవరకూ నేను చేసిన పొర

పాటును క్షమించగలిగితే క్షమించండి. మీ అబ్బాయి మీ యిష్టప్రకారం సమ్మతించడానికి నేను ప్రయత్నిస్తాను. నన్ను నమ్మండి.''

ముసలాయన వెళ్ళిపోయారు. యథావిధిగా పెళ్ళి జరిగిపోయింది.

మేరీ చెప్పడం పూర్తిచేసింది.

ఆ సమయంలో చాలా బలహీనంగా, నిస్సారంగా కనిపించింది.

నాకు కళ్లు చెమ్మగిల్లాయి.

"మేరీ! నీకు పెళ్ళయిందన్నావు!" అని అడిగాను.

"నిజం మాలతీ! నేను వారిని ఏనాడు ప్రేమించానో ఆనాడే వారు నాకు భర్త అని నిర్ణయించాను. మానసికంగా వారు నా భర్త. ఆ విధంగానే నా ఊహ పెరిగింది. ఆరాధించాను. ఆశ నిరాశైంది. ఊహ ఆగిపోయింది. కానీ చెదిరిపోలేదు. నా హృదయం గూటినుంచి వారు పారిపోలేదు. వారు నాలోనే వున్నారు. నాలోనే వుంటారు. నేను వారిని చూడని క్షణమంటూ లేదు. ఇది నా జీవిత రహస్యం!"

మేరీ గొప్పతనానికీ, సహనానికీ, అప్రయత్నంగా చేతులెత్తి దండం పెట్టాను.

''మాలతీ-వూరికి వెడుతూనే ఉత్తరం వ్రాయి!'' మామూలు ధోరణిలో మాట్లాడడానికి ప్రయత్నించింది.

కానీ నేను ఒక్క క్షణమైనా అక్కడ వుండలేకపోయాను.

"వస్తాను మేరీ!-''అని చెప్పి, పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకోడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ యిల్లు చేరాను.

*    *    *

కారు దిగుతూనే అత్తయ్య యెదురొచ్చింది.

''నా నమ్మా....నా నమ్మా!...."

అంటూపాపా,బాబూ చేతులుఅందిచ్చారు.

నెలరోజులు తాతయ్యా, అమ్మమ్మ పెట్టిన చిరుతిండ్లకే గుమ్మడిపండులా బలిశారు పిల్లలిద్దరూ. చేతులందించిన పాపను మోయలేక సతమత మౌతున్న అత్తయ్య నన్ను చూచి,

"ఏమే మాలతీ! పిల్లలిద్దరూ యిలా చీపురుపుల్ల లయ్యారు! సరిగ్గా వేళకు తిండైనా పడేశావా? లేక నీ తిరుగుళ్లే నీవా?" అంటూ బుగ్గమీద వేలేసుకుంది అత్తయ్య.

''నన్నేంచేయమంటారు? మీరు లేరని పిల్లలు బెంగెట్టుకున్నారు'' కసిగా అని లోపలికి వెళ్ళాను.

హాల్లో కూర్చుని, పేపరు తిరగేస్తున్న మావారు,"ఏంమాలతీ- స్తంభంలాతయారయ్యావ్? నేను లేకపోతే హాయిగా వుందికదూ?'' నవ్వుతూనే అన్నారు.

నాకు ఒళ్ళు మండింది. ''నేనెలాగున్నా, తల్లీ, కొడుకులు గుర్తుపట్టలేనంతగా మారిపోయారు!" నవ్వుతూనే అత్తయ్య వినేలా గట్టిగా అన్నాను.

''ఏమోలే తల్లీ-నీ కళ్ళు పడ్డాయిగా-యిక హారతికర్పూరంలా హరించుకపోతాము!'' పిల్లదాన్ని మోయలేక, వారిచేతి కిస్తూ అన్నది అత్తయ్య. ఇక పెంచుకుంటే పెద్దదౌతుం దని వూరుకున్నాను.

సాయంకాల మైంది. పిల్లలిద్దరూ అత్తయ్యతో గుడికి వెళ్ళారు. ఇంట్లో వుంటే, నాతో మాట్లాడాలేమో అన్న భయంతో ఏదో కొంపమునిగే పనుం దని వారు వెళ్ళిపోతూ,

''రాత్రి రావడానికి ఆలస్యమౌతుంది. నా కోసం వెయిట్ చెయ్యకు'' అని చెప్పి మరీ వెళ్ళిపోయారు.

క్షణం నవ్వుకున్నాను. ఇంట్లో యేం తోచిందికాదు. సీత యింటికి వెళ్ళాను.

సీత కలవారి కోడలు. డబ్బు విలువ తెలియదు. అత్తపోరు లేదు. దేవతలా పూజించేభర్త. ఇంతకంటే ఏ స్త్రీమాత్రం యెక్కువగా యేం కోరుకుంటుంది!

సీత నన్ను చూస్తూనే, ''నీవులేక మీ ఆయన, అత్తయ్య చాలా యిబ్బంది పడిపోయారు!" మా ఇంటిసంగతి పూర్తిగా తెలిసే నన్ను వుడికించడానికి అన్నది సీత.

"వారి కేం గోపాలకృష్ణులు! ఎన్ని వింతలైనా చేసుంటారు. ఇహాపోతే, అత్తయ్య నోటికి పనిలేక చేదెక్కుంటుంది."

"మాలతీ - నిజంగా గోపికా చోరులైనా నీవు వూరుకున్నావా?'' ఎదురు ప్రశ్న.

''ఆనాటి సత్యభామకే చేతగాక, కాలితో తన్నే కట్టేసుకోలేకపోయిందట!"....ఇక నే నెంత, అన్న బాధతోనే అన్నాను.

సీత మాట మార్చింది. తాతయ్య వూరి విశేషా లడిగింది. మేరీ నా కళ్ళ ముందు ప్రత్యక్ష మయ్యింది. సీతకు మేరీనిగూర్చి పూర్తిగా చెప్పేశాను. ఎలా ప్రారంభించి, ఎలా ముగించేశానో! నాకే తెలియదు. కష్టాలంటే ఎటువంటివో తెలియని సీత కళ్ళు చెమ్మగిల్లాయి.

''సీతా! మేరీ అతని పేరునే మనస్సులో అనుకొని నిజంగా అతనితో మాట్లాడుతున్నట్లు తృప్తిపడుతుందట! కన్యగా వుండే, మానసికంగా దాంపత్య జీవితాన్ని అనుభవిస్తుందట!"

మేరీ జీవితరహస్యాన్ని చెప్పేశాను.


సీత భోరు మన్నది. తల బాదుకుంది. గుండెను పిండుకుంది.

"మాలతీ-యిక చెప్పకు. ఈ పాపాత్మురాలిపై కరుణ చూపు. కనికరించు....''

నాకు సీత మాటలు యేమాత్రం అర్థంకాలేదు. సీత ఒక్కపరుగులో తన రూములోకి పోయి తిరిగి వచ్చింది.

''మాలతీ! యీ ఉత్తరాన్ని చదువు-ఇంతటి భయంకర నాటకంలో నే నేపాత్ర నిర్వహిస్తున్నానో తెలుసుకో!"

సోఫాలో కూలిపోయింది.




నలిగిపోయిన ఉత్తరాన్ని విప్పాను.

"....మీకు

జీవితంలో నేను చేయరాని పొరపాటు చేశాను—అది మిమ్ములను ప్రేమించి నా వాడినిగా చేసుకోడానికి ప్రయత్నించడమే! చేసింది తప్పని తెలుసుకొని, మళ్ళీ తప్పుటడుగు వెయ్యలేను. తన సర్వస్వంగా మీ రని నమ్మి వున్న మీ నాన్న మాట కాదనకండి. కాదని మీరు ఎదిరించి వచ్చినా నేను యెన్నటికీ మీకు దక్కను. ఈ నాటినుండి మన యిద్దరి మధ్య వున్న బంధం తెగిపోయింది. గతం మర్చిపోండి. ప్రేమ నిజంగా పవిత్రమైనదైతే-ఆ పవిత్ర ప్రేమతోనే మీరు నన్ను కోరివుంటే, నా కోర్కెను మన్నించి నన్ను మరిచిపోవడమే దానికి రుజువనుకోండి. నా కోర్కెను మన్నించే వారు నా ఆఖరి ప్రార్థనకూడా నెరవేర్చమని వేడుకుంటున్నాను. స్త్రీ హృదయం అతి సున్నితమైంది. చిన్న కుదుపునుకూడా ఓర్చుకోలేక రణమైపోతుంది. మిమ్ము నమ్మి సహచరిణిగా వచ్చిన అబల జీవితం మీ చేతులతో పునీతం కావాలి. అంతులేని ఆనందాన్ని, సుఖాన్ని అనుభవించాలి. ఇదే నా ఆఖరి ప్రార్థన!

శలవు,
మేరీ.''

ఉత్తరం చదివిన నేను కొన్ని క్షణాలు కొయ్యబారిపోయాను.

''మాలతీ! సీత యింత పాపానికి ఒడిగట్టిం దనుకుంటున్నావు కదూ?'' హీన స్వరంలో కీచుమన్నది గొంతు.

''లేదు సీతా!"

"మాలతీ!-నా పెండ్లి ముందు నాకి విషాదగాథ తెలియదు. వివాహానంతరం మా వారి ఆదరణకు మురిసిపోయేదాన్ని. ప్రపంచంలో ఏ స్త్రీ నా అంత సుఖజీవి వుండ దని గర్వపడ్డాను. త్వరలోనే నా ఆనందం, గర్వం అంతమయ్యాయి. ఒకసారి వారు లేని సమయాన వారి గది సర్దుతున్నప్పుడు వారి పాత డైరీలోనుండి యీ ఉత్తరం క్రింద పడింది. తీసి చదివాను. అంతే! ఆనాటినుంచి నాలో అగాధమే ఏర్పడింది. ఈ స్థానం నాది కాదు. అర్హతలేని చోట నేను తిష్టవేసుకుని నిశ్చింతగా జీవితాన్ని గడపలేను. వారు కోరుకున్నది కల్పవృక్షం - కానీ జిల్లేడుచెట్టు కాదు. ఆనందంగా వారితో ఒక్క క్షణం నేను గడపలేను. నాకోసం రెండు జీవితాలు బలైపోయాయి! నాకు యిక్కడ మనశ్శాంతి లేదు. ఆనందం, ఆశలు ఎప్పుడో యేనాడో అణగారిపోయాయి! యాంత్రికంగా జీవితం గడిచిపోతుంది. వారు లేక మేరీ, వుండి నేను బాధపడి నాశన మౌతున్నాం. మాకు విముక్తి లేదు...." సీత యిక మాట్లాడలేక నన్ను కౌగిలించుకొని భోరుమన్నది.

ఇంట్లో అడుగు పెడ్తూనే, మా అత్తయ్య కేకలు వినిపించేయి. మామూలు ధోరణిలో అత్తయ్య నన్ను వున్న బలం కొద్దీ కేక లేసింది. నే నేమీ చలించలేదు. నాలో రెండు అగాధాలు నిండివున్నాయి. నలుగుర్లో గొప్పగా హుందాగా వున్న యిద్దరి జీవిత రహస్యాలు యిమిడి వున్నాయ్.

ఆనాడు ''మీరు అదృష్టవంతులు"అని మేరీ అన్నమాటలు గుర్తుకు వచ్చేయి!